బలగం
BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 16 డిసెంబర్ 2025 www.balagamtv.com పేజీలు 4


## మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు సహకరించండి

### రాష్ట్ర ఎన్నికల సంఘం వినతి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
బుధవారం జరగనున్న మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు ప్రజలు సహకరించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఎన్నికలు జరిగే పంచాయతీల్లో సోమవారం సాయంత్రం 5గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు నిషేదాజ్ఞలు అమల్లో ఉంటాయని పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడటం, పోలింగ్, లెక్కింపు కేంద్రాల్లో ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది ఉండటం నిషేదమని పేర్కొంది. బీఎన్ఎస్ఎస్ 163 ప్రకారం ఊరేగింపులు, బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదని తెలిపింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఉపాధి హామీలో కీలక మార్పులు

- కొత్త బిల్లుకు సిద్ధం
- కొత్త బిల్లుకు 'వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఔర్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు-2025' అని పేరు పెట్టారు.
- 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణాభివృద్ధి ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశం.
- గ్రామీణ కుటుంబాల్లో నైపుణ్యం లేని పనులకు ముందుకు వచ్చే వయోజనులకు సంవత్సరానికి 125 రోజుల వేతనం
- కొత్త చట్టం "శక్తి, వృద్ధి, సమన్వయం, సంతృప్తి" సూత్రాల ఆధారంగా సంపన్నమైన గ్రామీణ భారత నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.
- ఈ బిల్లును పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**
దేశంలోని గ్రామీణ ఉపాధి హామీ విధానంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లును లోక్‌సభ సభ్యులకు సర్క్యులేట్ చేసినట్లు సమాచారం. 2005లో గ్రామీణ ఉపాధి హామీ కోసం రూపొందించిన నరేగా చట్టం స్థానంలో లిలి'వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఔర్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు%–%2025'లిలిను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.

**కొత్త చట్టంలో 125 రోజుల పని హామీ**

2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) జాతీయ లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణాభివృద్ధి ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ఈ బిల్లు ప్రధాన లక్ష్యంగా పేర్కొంటోంది. కొత్త చట్టం ప్రకారం గ్రామీణ కుటుంబాల్లో నైపుణ్యం లేని పనులకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వయోజనులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీ కల్పించనున్నారు. ఇది ప్రస్తుత MGNREGAలో ఉన్న 100 రోజుల హామీతో పోలిస్తే 25 రోజులు ఎక్కువ. ఈ చట్టం ద్వారా "శక్తి, వృద్ధి, సమన్వయం, సంతృప్తి" లక్ష్యాలతో సంపన్నమైన, సుస్థిరమైన గ్రామీణ భారతాన్ని నిర్మించడమే ఉద్దేశమని బిల్లులో పేర్కొన్నారు.

**పార్లమెంట్‌లో ప్రవేశం ఎప్పుడంటే..?**

ఈ బిల్లు ఇప్పటికే లోక్‌సభ సభ్యులకు సర్క్యులేట్ అయ్యింది. డిసెంబర్ 1 నుంచి ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 19న ముగియనున్న నేపథ్యంలో, ఈ సమావేశాల్లోనే బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

గ్రామీణ ఉపాధికి హామీ ఇచ్చే నరేగా చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకురాగా, 2009 అక్టోబర్ 2న దీనికి MGNREGAగా పేరు మార్చారు. దేశంలోని పేద ప్రజలకు కనీస ఉపాధిని కల్పించడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషించింది. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ చట్టం స్థానంలో కొత్త బిల్లు రావడం దేశ ఆర్థిక, సామాజిక విధానాల్లో ఒక ప్రధాన మార్పుగా భావిస్తున్నారు.

# రెండేండ్ల పాలన తెలంగాణ రైజింగ్

- సామాజిక, ఆర్థిక పురోగతికి పరుగులు
- దేశంలోనే ఆదర్శవంతమైన కార్యక్రమాలు అమలు
- దేశవిదేశాలను ఆకర్షించిన ఫ్యూచర్ సిటీ
- తెలంగాణ సీఎంఓ




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
రెండేండ్ల కాంగ్రెస్ పాలన తెలంగాణ రైజింగ్ అని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. 24 నెలల ప్రజా పాలనలో తెలంగాణ సామాజికంగా, ఆర్థికంగా కొత్త అడుగులు వేసిందని తెలిపింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచే ప్రజాస్వామిక మార్పు మొదలైందని పేర్కొంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సుస్థిర పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టిందని తెలిపింది. రోజుకో వినూత్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన విధానాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొంది. ఆరు గ్యారంటీల హామీల అమలుతో మొదలైన ప్రయాణం నాలుగు కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ఆవిష్కరించే దిశగా పరుగులు తీసిందని ప్రకటించింది. తెలంగాణను ది ఫ్యూచర్ స్టేట్‌గా.. హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన బృహత్తర ప్రయత్నం దేశవిదేశాలను ఆకర్షించిందని తెలిపింది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు తరలిరావటం శుభ పరిణామమని పేర్కొంది.

దేశంలోనే వినూత్నంగా రాష్ట్రంలో విజయవంతంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన, బీసీలకు రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, రేషన్ కార్డుదారులపై సన్న బియ్యం పంపిణీ వంటి చర్యలు మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు పదేండ్లుగా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దిందని పేర్కొంది. న్యాయమైన నీటి వాటాల సాధనకు ప్రజా ప్రభుత్వం చేసిన పోరాటం అందరినీ ఆకర్షించిందని తెలిపింది. రికార్డు వేగంతో 61,379 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చిందని ప్రకటించింది. అప్పుల్లో చిక్కిన రాష్ట్ర ఖజానాను వడ్డీల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుసరించిన లోన్ రీస్ట్రక్చరింగ్ ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పట్టిందని తెలిపింది. వాటితోపాటు ప్రభుత్వం ఈ రెండేండ్లలో అన్ని వర్గాలనూ ఆకట్టుకునేందుకు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను చేపట్టిందని పేర్కొంది.

# ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రాంతాలకతీతం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- రవీంద్ర భారతి ప్రాంగణంలో బాల సుబ్రహ్మణ్యం విగ్రహం ఆవిష్కరణ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
వివిధ భాషలలో వేలాది పాటలు పాడిన ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం ప్రాంతాలకు అతీతం అని ఆయన సంగీత స్వర సార్వ భౌముడు అని భారత దేశ పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభివర్ణించారు రవీంద్ర భారతి ప్రాంగణం లో విఖ్యాత గాయకుడు శ్రీ పతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం విగ్రహం ఆవిష్కరణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ది మ్యూజిక్ గ్రూప్ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహణలో జరిగింది ముఖ్య అతిథిలు గా వెంకయ నాయుడు తో పాటు హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాష్ట్ర పరిశ్రమలు శాఖా మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని విగ్రహం ఆవిష్కరణ చేశారు

ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఉపరాష్ట్రపతి ఎమ్ వెంకయ్యనాయుడు మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం గాత్రం అక్షయపాత్ర వంటిదనీ, ఎవరికి ఏం కావాలో దాన్ని ఆయన తన స్వరంతో పలికించేవారని చెప్పారు. తెలుగుభాష ఉచ్చారణ అద్భుతంగా ఉంటుందనీ, డబ్బింగ్ ద్వారా కమల్ హాసన్ వంటి నటుల పాత్రలకు జీవం పోశారని కీర్తించారు. పాడుతాతీయగా కార్యక్రమం ద్వారా భవిష్యత్ సంగీత కళాకారుల్ని ఆయన ముందే నిర్ణయించేశారని చెప్పారు. ప్రస్తుతం యువతరం పాశ్చాత్య వ్యామోహంలో కొట్టుకుపోతున్నదనీ, మమ్మీ డాడీ కల్చర్‌ను వదిలేసి, మాతృభాషలో అమ్మానాన్న అని మాట్లాడుకోవాలని సూచించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రి సాంబమూర్తి భిక్షాటన చేసి, సంగీతానికి సేవ చేశారని గుర్తుచేశారు. బాలసుబ్రహ్మణ్యం ప్రతిభతో పాటు మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన భౌతికంగా లేకున్నా, ఆయన స్వరం ఎప్పటికీ తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతుందని స్పష్టం చేశారు. తెలుగుభాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే బాలసుబ్రహ్మణ్యంకు తెలుగువారు ఇచ్చే అతిపెద్ద నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో రారాజుగా వెలుగొంది, కోట్లాదిమంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని తెలిపారు. సంగీతానికి భాష, ప్రాంతంతో సంబంధం లేదనీ, మనిషి జీవితంలో అదో భాగమని స్పష్టం చేశారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ తెలుగు ప్రజలకు గౌరవసూచకమని అన్నారు. 50 ఏండ్లలో 16 భాషల్లో 40వేల పాటల్ని పాడి శ్రోతల మనసుల్ని గెలుచుకుని, అజాతశత్రువుగా నిలిచారని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఓ ప్రాంతానికి పరిమితం కాదనీ, ఆయన స్ఫూర్తివంతమైన భారతీయుడని చెప్పారు. సంగీత ప్రపంచానికి ఆయన చేసిన సేవలు అమోఘమని శ్లాఘించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, మల్లు ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం బాల్య స్నేహితులు జీవీ మురళి, విగ్రహ శిల్పి వడయార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ప్రముఖ యాంకర్ సుమ, ప్రదీప్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి, కుటుంబసభ్యులు పార్వతి, శైలజ, శుభలేఖ సుధాకర్ చరణ్, పాల్గొన్నారు. సభానంతరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం శిష్యులు ఆలపించిన సంగీత విభావరి ఆహ్లాదంగా, వీనులవిందుగా కొనసాగింది.

# సర్పంచులను వేధిస్తే ఊరుకోం..

- ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు
- కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు.. న్యాయపరంగా అండగా ఉంటాం
- రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- సిరిసిల్లలో నూతన సర్పంచులకు

**దిశానిర్దేశం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన బిఆర్ఎస్ గెలుపొందిన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్, విజేతలను అభినందిస్తూ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

**సర్పంచుల కోసం లీగల్ సెల్ ఏర్పాటు: కేటీఆర్ భరోసా.**

సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది," అని ఆయన స్పష్టం చేశారు. కోర్టు ద్వారా తమ హక్కుల కోసం పోరాడదామని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత.**

కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు బెదరకుండా ప్రజలు, బిఆర్ఎస్ నేతలు నిలబడ్డారని, అందుకే అత్యధిక స్థానాల్లో ప్రతిపక్షంలో ఉన్న తమ పార్టీని గెలిపించారని కేటీఆర్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పట్ల నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి, వ్యతిరేకతకు నిదర్శనం అన్నారు.

**పదవి ముఖ్యం కాదు.. పనే ముఖ్యం.**

సర్పంచులు పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామం చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. పల్లె ప్రగతి ద్వారా ప్రతి ఊరిలో నర్సరీ, డంప్ యార్డ్, ట్రాక్టర్, వైకుంఠధామం వంటివి ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామని తెలిపారు.

**శిక్షణా తరగతులు త్వరలో.**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు.

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రికార్డు అభివృద్ధి.

దేశ జనాభాలో కేవలం 3 శాతం ఉన్న తెలంగాణ, కేంద్రం ప్రకటించిన ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం కైవసం చేసుకోవడం కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రికార్డును దేశంలో ఏ రాష్ట్రం కూడా సాధించలేదని అన్నారు. తాగునీటి సరఫరా, పరిశుభ్రత నిర్వహణ, పచ్చదనం వంటి అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.


## కాంగ్రెస్ నాయకుల గూండాగిరి శృతి మించుతోంది

వివరాలు 2వ పేజీలో

- దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎస్పీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని కోరిన కేటీఆర్ ● బీఆర్ఎస్ తిరగబడితే శాంతి భద్రతలు అదుపులో ఉండవని హెచ్చరిక

# పహల్గాం ఉగ్రదాడి కేసులో ఎన్ఐఎ ఛార్జిషీట్

- పాక్ ఉగ్రసంస్థల కుట్ర
- స్పెషల్ కోర్టుకు నివేదిక




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సోమవారం స్పెషల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. మొత్తం 1597 పేజీలతో కూడిన ఈ ఛార్జిషీట్‌లో ఆరుగురు నిందితులతో పాటు పాకిస్థాన్‌కు చెందిన రెండు ఉగ్రవాద సంస్థల ప్రమేయాన్ని స్పష్టంగా పేర్కొంది.

ఎన్ఐఎ దాఖలు చేసిన ఛార్జిషీట్ ప్రకారం, పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) మరియు దాని అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ఈ ఉగ్రదాడికి కుట్రపన్ని అమలు చేసినట్లు నిర్ధారించింది. ఎల్ఈటీ అధినేత హఫీజ్ సయీద్ నేతృత్వంలో ఈ దాడికి రూపకల్పన జరిగిందని ఛార్జిషీట్‌లో వెల్లడించింది. టీఆర్ఎఫ్‌ను హబీబుల్లా మాలిక్ నడిపిస్తున్నట్లు పేర్కొంది. ఈ కేసులో పాకిస్థాన్‌కు చెందిన సాజిద్ జాట్ అనే హ్యాండ్లర్ పేరును కూడా ఎన్ఐఎ చేర్చింది. అలాగే 'ఆపరేషన్ మహాదేవ్'లో ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమైనట్లు తెలిపింది. హతులైన వారిలో ఫైజల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్గానీ ఉన్నారని పేర్కొంది. ఉగ్రవాదులకు స్థానికంగా సహకరించిన పర్వైజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ జోథర్‌ల పేర్లను కూడా నిందితుల జాబితాలో చేర్చింది.దాదాపు ఎనిమిది నెలల పాటు శాస్త్రీయ ఆధారాలతో సమగ్ర దర్యాప్తు చేపట్టిన అనంతరం ఈ ఛార్జిషీట్‌ను దాఖలు చేసినట్లు ఎన్ఐఎ వెల్లడించింది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేయం ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించినట్లు పేర్కొంది. గత ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు విచక్షణలేని కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 25 మంది నిరపరాధ పౌరులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడి దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

## ఢిల్లీలో గరిష్ట స్థాయికి వాయు కాలుష్యం




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**
దేశ రాజధానిలో వాయు కాలుష్యం గరిష్ట స్థాయికి చేరింది. గాలిలో నాణ్యత పూర్తిగా పడిపోయింది. కంటి ముందు ఏమీ కనిపించని విధంగా పరిస్థితి దారుణంగా మారింది. దీంతో ఢిల్లీ విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 170 విమానాలను సోమవారం రద్దు చేశారు. వందలాది విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. మరోవైపు రైళ్లు కూడా నత్తనడక నడుస్తున్నాయి. ఉదయం వేళలో రోడ్లపై వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. రాజధానిని ఉదయం మంచుపొర పూర్తిగా కప్పేసింది. నగరంలో సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 498గా నమోదైంది. దీనిని బట్టి వాయు నాణ్యత 'తీవ్రమైన' కేటగిరీలో ఉన్నదని అర్థమవుతోంది. న్యూఢిల్లీలో 40 వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 30 కేంద్రాలు వాయు నాణ్యత దారు ణంగా ఉన్న దని తేల్చాయి. రెండు కేంద్రాలు చాలా పేలవమైన స్థాయిని సూచించాయి. జహంగీర్‌పురి ప్రాంతం అత్యంత కాలుష్య ప్రదేశంగా నిర్ధారణ అయింది. అక్కడ ఏక్యూఐ 498గా నమోదైంది. ఇతర కేంద్రాలతో పోలిస్తే ఇదే అత్యధిక సూచీ. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) ప్రకారం ఏక్యూఐ 401–500 మధ్య ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉన్నట్టు పరిగణించాలి. వాయు కాలుష్యం ఈ స్థాయిలో ఉంటే తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఆదివారం కూడా ఢిల్లీలో ఏక్యూఐ 461గా నమోదైంది. వాతావరణ పరిస్థితులు సానుకూలంగా లేకపోవడంతో కాలుష్య స్థాయిలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.




## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నబీన్ సిన్హా బాధ్యతల స్వీకరణ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**
బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు స్వీకరించారు. డీల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. మధ్యాహ్నం పాట్నా నుంచి ఢిల్లీ చేరుకున్న నితిన్ నబీకి దిల్లీ విమానాశ్రయంలో సీఎం రేఖా గుప్తా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న నితిన్ నబీ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. తర్వాత నితిన్ నబీని కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా స్వయంగా తొడ్కొని వెళ్లి కుర్చీలో కూర్చొబెట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పుష్పాలు అందించిన కృతజ్ఞతలు తెలిపారు.

# టిమ్స్ హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచాలి



- ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశాలు,రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సోమవారం అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణం కలియతిరిగిన స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ ఇంజనీర్లను,వర్క్ ఏజెన్సీని పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులకు,నిర్మాణ సంస్థకు పలు కీలక ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్ర ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని,త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కృత నిశ్చయంతో ఉందని స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ అన్నారు. అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ 12,14,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు 1196 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తు న్నామని,ముఖ్యమంత్రి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి రెగ్యులర్‌గా నిర్మాణ పురోగతిపై మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు.

ఇప్పటికే పూర్తి నాణ్యతతో స్ట్రక్చరల్ వర్క్ పూర్తయిందని,95% బ్రిక్ వర్క్, ప్లాస్టరింగ్ పూర్తయిందని, ఎంఈపీ 60%, ఫ్లోరింగ్, పెయింటింగ్ వర్క్స్ 50శాతం మేర పూర్తయి వేగంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. మొత్తంగా టిమ్స్ అల్వాల్ పనులు 70% శాతం పూర్తయ్యాయని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విధించిన గడువులోగా..2026 మార్చి చివరి నాటికి అన్ని రకాల పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను, వర్క్ ఏజెన్సీని స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అన్నారు. రెగ్యులర్ గా ఫీల్డ్ విజిట్ చేస్తానని అందరూ అలెర్ట్ గా పనిచేస్తూ.. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ విజిట్ లో ఆర్ అండ్ బి సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి,లింగారెడ్డి,పలువురు ఈ.ఈ, డి.ఈ లు ఫీల్డ్ ఇంజనీర్లు, డీఈసీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## 20న కొత్త సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం..

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 20న బాధ్యతలు చేపట్టనున్నారు.ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రమాణస్వీకారం చేయించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు విడతల్లో ఎన్నికైన వారు ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో 12,700 గ్రామపంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి.



## ఎల్లారెడ్డిపేటలో బీజేపీ సర్పంచ్ అభ్యర్థి తిరుపతి భారీ ఎన్నికల ప్రచారం..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సర్పంచ్ అభ్యర్థి అంతేర్పుల తిరుపతి నేడు భారీ ఎత్తున ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుండి ర్యాలీ మహిళలతో ఫుట్బాల్ గుర్తును ప్రదర్శిస్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మొదటగా మహనీయుడు గాంధీ విగ్రహానికి బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ముఖ్యఅతిథిగా హాజరైన పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నంది నరేష్, జిల్లా సీనియర్ నాయకులు రావుల గాల్ రెడ్డి, పారిపెల్లి సంజీవరెడ్డి కార్యకర్తలు యువకులు మహిళలు గ్రామస్తులు హాజరయ్యారు.

## స్తంభంపల్లి సర్పంచ్‌గా అశోక్ గౌడ్ విజయం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన అభ్యర్థి బొంగాని అశోక్ గౌడ్ విజయం సాధించి, జిల్లాలో పార్టీకి బోణీ అందించారు. స్తంభంపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. బీజేపీకి చెందిన బొంగాని అశోక్ గౌడ్ తన సమీప ప్రత్యర్థిపై గెలుపొందారు. కొన్ని సంవత్సరాలుగా బీజేపీ పార్టీని నమ్ముకుని, అనేక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నిరుపేదలకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించడం అశోక్ గౌడ్‌కు ఈ విజయాన్ని తెచ్చిపెట్టింది. ఈ సందర్భంగా మాట్లాడిన అశోక్ గౌడ్, తనకు ఓట్లు వేసి గెలిపించిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత పదును పెట్టాలి

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత బలోపేతం చేసి, పూర్తిస్థాయిలో సంస్కరించాలని ప్రతిపక్షాలు రాజ్యసభలో డిమాండ్ చేశాయి. ప్రజాతీర్పును గౌరవించేలా చట్టాలు ఉండాలని కేంద్రానికి పిలుపునిచ్చాయి. సోమవారం ఎగువ సభలో ఈ అంశంపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ సభ్యుడు కే.ఆర్. సురేష్ రెడ్డి, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ, యథేచ్ఛగా జరుగుతున్న పార్టీ ఫిరాయింపులు ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతకు తీవ్ర భంగం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల వాగ్దానాలకు కట్టుబడి లేకపోవడం ఓటర్ల కంట్లో దుమ్ము కొట్టడమేనని విమర్శించారు. ఫిరాయింపుల చట్టం సరిగా అమలులో లేకపోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రెండుసార్లు రాజ్యాంగ సవరణలు జరిగినప్పటికీ ఫిరాయింపులు కొనసాగుతూనే ఉన్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద సవాలుగా మారిందని అన్నారు. ఓటింగ్ పూర్తయినంత మాత్రాన ఓటర్ల బాధ్యత తీరిపోదని, ప్రజాప్రతినిధులను నిలదీసేలా బలమైన చట్టాలు అవసరమని సూచించారు. ప్రస్తుతం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందని, ఎన్నికలు ముగియగానే అసలు నాటకాలు మొదలవుతున్నాయని వ్యాఖ్యానించారు.చిన్న రాష్ట్రాల్లో జరుగుతున్న పార్టీ ఫిరాయింపులు పలు అనర్థాలకు దారితీస్తున్నాయని పేర్కొంటూ, తెలంగాణలో తమ పార్టీకి జరిగిన నష్టాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. వెంటనే ఫిరాయింపుల నిరోధక చట్టంలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఫిరాయింపుల అంశాన్ని పర్యవేక్షించేందుకు చట్టసభల్లో సాధికారిక కమిటీ ఎందుకు లేదని సురేష్ రెడ్డి ప్రశ్నించారు. ఈ లోపం వల్లే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వస్తోందని అన్నారు. ఇప్పటికే కోర్టులపై భారం ఉన్నప్పటికీ, చట్టసభల పరిధిలోని అంశాలను న్యాయస్థానాలకు అప్పగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పార్టీ టికెట్‌పై గెలిచి తరువాత మరో పార్టీలోకి మారిన ప్రజాప్రతినిధులకు ప్రజల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉంటుందని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను గాలికి వదిలిపెట్టడం, ఫిరాయింపులకు దిగడమే నిజమైన 'ఓటు చోరీ' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ, ఫిరాయింపుల నిరోధక చట్టంతో చిన్నపాటి ఫిరాయింపులు కొంతమేర తగ్గినా, ప్రస్తుతం హోల్‌సేల్‌గా, మూకుమ్మడిగా పార్టీలు మారే పరిస్థితి పెరిగిందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకర పరిణామమని ఆయన హెచ్చరించారు.

## కాంగ్రెస్ నాయకుల గూండాగిరి శృతి మించుతోంది

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి**
- **ఎస్పీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని కోరిన కేటీఆర్**
- **బీఆర్ఎస్ తిరగబడితే శాంతి భద్రతలు అదుపులో ఉండవని ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక**



**బలగం టీవీ, కామారెడ్డి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ఆ పార్టీ నాయకుల గూండాగిరి రోజురోజుకూ శృతి మించుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అమానుష ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు తెగబడటం పిరికిపంద చర్య అని మండిపడ్డారు.

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలో బీఆర్ఎస్ తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బిట్ల బాలరాజు, ఫలితాల తర్వాత తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ఇంటి ముందు కూర్చుని ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి స్థానిక మండల అధ్యక్షుడు సాయిబాబా ట్రాక్టర్‌తో అక్కడకు వచ్చి బీభత్సం సృష్టించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. నన్ను ఎవరూ ఏం చేయలేరు" అంటూ విర్రవీగుతూ.. నిల్చున్న వారిపైకి ట్రాక్టర్ ఎక్కించి ఢీకొట్టారు. ఈ దాడిలో బీఆర్ఎస్ అభ్యర్థి బాలరాజుతో పాటు ఆయన అనుచరులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

ఈ విషయం తెలుసుకున్న వెంటనే కేటీఆర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్ చార్జ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. పార్టీ వారికి అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు.

అనంతరం కామారెడ్డి జిల్లా ఎస్పీకి కేటీఆర్ స్వయంగా ఫోన్ చేశారు. సోమార్‌పేట్ ఘటనను వివరించి, బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "అధికారం ఉంది కదా అని కాంగ్రెస్ నేతలు హత్యాయత్నాలకు పాల్పడుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా?" అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని, ప్రజలు, కార్యకర్తలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని కేటీఆర్ హెచ్చరించారు. అదే జరిగితే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. గాడి తప్పిన కాంగ్రెస్ నేతలను కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసులదే అని ఆయన తేల్చిచెప్పారు.

## పంచాయితీల అభివృద్ధి ప్రత్యేక నిధులు కేటాయించాలి..

- **సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు,**
- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్**
- **పెద్దలింగాపూర్ సర్పంచ్ ను సత్కరించిన సీపీఐ(ఎం) నేతలు**



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

నిస్వార్థ ప్రజా సేవకు పట్టం కట్టి నిరంతరం ప్రజల కోసం పోరాడే ప్రశ్నించే గొంతుక ప్రజా ఉద్యమాల సారధి గన్నేరం వసంత నర్సయ్యను గెలిపించిన పెద్ద లింగాపూర్ గ్రామ ప్రజలకు జేజేలు తెలియజేస్తూ సర్పంచ్ గా గెలుపొందిన వారిని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి స్కైలాబ్ బాబు జిల్లా పార్టీ కార్యదర్శి మూషం రమేష్, కార్యదర్శివర్గ సభ్యురాలు జవ్వాజి విమల లు శాలువా కప్పి సత్కరించారు. సోమవారం ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ గా గెలుపొందిన సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు రాజకీయాల కతీతంగా పక్షపాత ధోరణి లేకుండా ప్రతి గ్రామానికి ప్రజల ప్రాథమిక సౌకర్యాల కల్పనకు తోడ్పడాలని చెప్పారు గెలిచిన సర్పంచ్ లను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న బిజెపి కాంగ్రెస్ నేతల వైఖరిని తీవ్రంగా ఖండించారు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు ప్రజల ఓట్లతో గెలిచిన సర్పంచులకు కేంద్రమంత్రి బండి సంజయ్ లక్షల రూపాయలు ఆఫర్ కేటాయిస్తూ తమ పార్టీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని,ఇది ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించారు. పెద్ద లింగాపూర్ గ్రామ ప్రజలు ప్రశ్నించే గొంతుకను ఎంపిక చేసుకున్నారని గ్రామంలో జరిగిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాటంలో రంగనాయక సాగర్ కాలువ పనులు పై జరిగిన పోరాటాల్లో గన్నేరం వసంత నర్సయ్య కృషిని ప్రజలు గుర్తించారని చెప్పారు.పెద్దలింగాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామముగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని చెప్పారు. గ్రామ ప్రజలు పాలక పార్టీలు డబ్బు మద్యాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని చెప్పారు.ముష్కన్ పేట లో ఏకగ్రీవంగా ఎన్నికైన సామనపల్లి రాములును పెద్దలింగాపూర్ లో వార్డు మెంబర్ గా గెలుపొందిన అనిల్ లకు శాలువా కప్పి సత్కరించారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు జవ్వాజి విమల, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, సిపిఎం నాయకులు సామ నర్సింహారెడ్డి, రాములు, అనిల్, రచ్చ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 2029 ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తా

- **'ఆస్క్ కవిత'లో కల్వకుంట్ల కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్**



2029లో జరిగే ఎన్నికల్లో తాను తప్పకుండా పోటీ చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సోమవారం ఎక్స్ వేదికగా 'ఆస్క్ కవిత' కార్యక్రమం నిర్వహించి, నెటిజన్లతో ఆమె ప్రత్యక్షంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. కొత్త పార్టీపై వస్తున్న ప్రచారాలపై స్పందిస్తూ, ఓ నెటిజన్ "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా, "ఎలా ఉండాలో మీరే చెప్పండి" అంటూ ఆసక్తికరంగా బదులిచ్చారు. ప్రజలు సూచించిన పేరునే పార్టీకి పెడతామని ఆమె వెల్లడించారు.

తెలంగాణ సాధికారత సాధించాలంటే నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో తల్లిదండ్రులు పిల్లల చదువుకోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టని పరిస్థితి రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, భద్రత %–% వీటిలో ఏది ప్రథమ ప్రాధాన్యం అన్న ప్రశ్నకు స్పందిస్తూ, యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన తొలి లక్ష్యమని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోసం తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగుతుందని చెప్పారు. జాగృతిని మరింత బలంగా తీర్చిదిద్దుతామని, త్వరలో మెంబర్‌షిప్ డ్రైవ్ ప్రారంభిస్తామని వెల్లడించారు. "సామాజిక తెలంగాణ"యే తన లక్ష్యమని మరోసారి నొక్కి చెప్పారు.

రేవంత్ రెడ్డి పాలనపై అడిగిన ప్రశ్నకు కవిత స్పందిస్తూ, ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణపై తన విజన్, జాగృతి భవిష్యత్ కార్యాచరణ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నెటిజన్లు సంధించిన ప్రశ్నలకు ఆమె విపులంగా సమాధానాలు ఇచ్చారు.

# 'సిరిసిల్ల'లో గులాబీ ప్రభంజనం




- ప్రతిపక్షంలోనూ పటు నిలుపుకున్న బీఆర్ఎస్
- రెండో విడత జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 30 స్థానాలకు 20 స్థానాలు గెల్చుకున్న బీఆర్ఎస్
- సింగిల్ డిజిట్ కే పరిమితమైన అధికార కాంగ్రెస్ పార్టీ
- 10 గ్రామాల్లో మూడవ స్థానంలో హస్తం పార్టీ
- దరిదాపుల్లో కూడా లేని బీజేపీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన రెండవ విడత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అనూహ్య విజయాన్ని సాధించి గులాబీ ప్రభంజనం సృష్టించింది. ముఖ్యంగా, తంగళ్లపల్లి మండలంలో జరిగిన 30 స్థానాలకు గాను ఏకంగా 20 సర్పంచ్ స్థానాలను గెల్చుకుని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తన పట్టును నిలుపుకుంది.

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో నిరాశపరిచింది. ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. పదికి పైగా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మూడవ స్థానంలో నిలవడం గమనార్హం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండేళ్ల పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**దరిదాపుల్లో కూడా లేని బీజేపీ..**

కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్లలో బీజేపీ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయింది. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే అధిక నిధులు ఇస్తామని బండి సంజయ్ చేసిన ప్రకటనను పల్లె ప్రజలు పట్టించుకోలేదు. ఈ ఎన్నికల్లో 16 గ్రామాల్లో బీజేపీకి అభ్యర్థులు కూడా పోటీకి దొరక్కపోవడం విశేషం.

తంగళ్లపల్లి మండలంలో బీఆర్ఎస్‌కు వచ్చిన ఈ భారీ విజయం, మూడవ విడతలో ఈ నెల 17న జరగనున్న ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల సర్పంచ్ ఎన్నికలపై ప్రభావం చూపనుంది. తాజా ఫలితాలతో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంతో ఉండగా, మిగిలిన నాలుగు మండలాల్లో కూడా బీఆర్ఎస్ మద్దతుదారులు మెజార్టీ స్థానాలు గెలిచే అవకాశాలు మెరుగుపడ్డాయని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## చింతలఠాణాలో మరణించిన సర్పంచ్ అభ్యర్థి కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్..

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ నియోజకవర్గంలోని చింతలఠాణా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విషాదకర పరిస్థితుల్లో మరణించిన సర్పంచ్ అభ్యర్థి (మృతుని పేరు మురళి) కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు పరామర్శించారు.

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్న సర్పంచ్ అభ్యర్థి, ఎన్నికల ఫలితాలకు కొద్ది రోజుల ముందు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. అయితే, గ్రామంలో ఆయన చేసిన సేవలు, బీఆర్ఎస్ పార్టీపై ఉన్న నమ్మకంతో చింతలఠాణా ప్రజలు మరణించిన ఆయనకే భారీ మెజారిటీతో ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపించారు. ఈ నేపథ్యంలో, సోమవారం చింతలఠాణా చేరుకున్న కేటీఆర్, మరణించిన సర్పంచ్ అభ్యర్థి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సహాయం అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు..

- జిల్లాలో అక్రమ మద్యంపై నిఘా ఉంచి 98 కేసులలో 1525 లీటర్ల మద్యం సిజ్..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఎంసీసీని కఠినంగా అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నిబంధనల ఉల్లంఘనలపై మొత్తం 11 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం విక్రయం మరియు రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఆకస్మిక దాడులు నిర్వహించి 98 కేసులలో 1525 లీటర్ల అక్రమ మద్యంను సీజ్ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ. 23,28,500/– నగదును కూడా పోలీసులు సీజ్ చేశారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారు మరియు గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా 224 కేసులలో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన నియమావళిని ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అలాగే, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్

- ఇల్లంతకుంట, వల్లంపట్ల, సారంపల్లిలో సందర్శన.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికల్లో భాగంగా పలు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. ఇల్లంతకుంట మండల కేంద్రం, వల్లంపట్ల, తంగళ్ళపల్లి మండలంలోని సారంపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందర్శించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓలు శశికళ, లక్ష్మీనారాయణ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీదే హవా

- రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీ నాయకుడు కేటీఆర్ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ "ఖతం" అయ్యిందని ఆయన వ్యాఖ్యానించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి, రెండవ విడుత పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైంది. కేవలం పరువు కాపాడుకోవడం కోసమే, మూడో విడత ఎన్నికల ప్రచారంలో లబ్ధి పొందడానికి కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లాలో బీఆర్ఎస్ కేవలం 60 స్థానాల వద్దే ఆగిపోయిందని, కానీ కేటీఆర్ మాత్రం 83 స్థానాలు గెలిచాం అని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇది ఎన్నికల్లో గెలవలేక పరువు నిలుపుకునే ప్రయత్నంలో చేస్తున్న తప్పుడు అంకెల గారడీ అని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. 83 సీట్లు గెలిచిన పేర్లు చెప్పగలరా అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. రెండు విడతల్లో రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీదే హవా అని, మూడో దశలో కూడా మెజారిటీ స్థానాలు తామే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. 2009 ఎన్నికల్లో కేటీఆర్ కేవలం 175 ఓట్ల తేడాతోనే గెలిచారనే వాస్తవాన్ని మర్చిపోకూడదని గుర్తు చేశారు. "యువరాజుగా చక్రం తిప్పిన" కేటీఆర్‌కు 2023 ఎన్నికల్లో మెజారిటీ ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. "యువరాజుగా ఉన్నప్పుడే నీ మెజారిటీ 89 వేల నుండి 27 వేలకు దిగజారింది" అని విమర్శించారు.

తాను ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్నానని, కేటీఆర్ లాగా ప్రజలను విడిచిపెట్టి పట్టణానికి పారిపోలేదని ఘాటుగా విమర్శించారు.



కేటీఆర్ స్వంత చెల్లి (కవిత) పార్టీని వదిలి వెళ్లారని, ఆమె చేసిన కామెంట్లకే సమాధానం చెప్పుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. భూ కబ్జాలపై ఆమె వేసిన ప్రశ్నల వర్షానికి ముందు సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ హత్యా రాజకీయాలపై మాట్లాడడం హాస్యాస్పదం అని ప్రభుత్వ విప్ అన్నారు. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయకుని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే, చంపడానికి యత్నించిన బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాల గురించి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. ఓటమి అక్కసుతోనే ఒక దళిత నాయకునిపై బీఆర్ఎస్ దాడి చేసిందని ఆరోపించారు. "గ్రామాల్లో సర్పంచ్‌లు ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు, మూడవ విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి కాలేదు కానీ కేటీఆర్‌కు అప్పుడే లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాను అంటున్నారు" అని, ఈ లీగల్ సెల్ పార్టీని కాపాడుకోవడానికేనని విమర్శించారు.

కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుతో వదిలిపెట్టిపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అప్పును భరిస్తూనే అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పది రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, అబద్ధపు ప్రచారాలు సరికాదు కేటీఆర్ అని, వారు చేసిన రుణమాఫీ 'మిత్తులకే' సరిపోయిందని విమర్శించారు.



## వేములవాడ సీనియర్ రిపోర్టర్ దాసరి దేవేందర్‌కు పితృవియోగం

- వారి కుటుంబానికి కేటీఆర్ పరామర్శ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) వేములవాడ సీనియర్ రిపోర్టర్ దాసరి దేవేందర్ ను మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీనియర్ రిపోర్టర్ దాసరి దేవేందర్ కు పితృవియోగంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో సిరిసిల్ల టౌన్, వెంకంపేట్‌లో ఉన్న దేవేందర్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. దేవేందర్ తండ్రి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో ఆయన కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని, వారికి భరోసా కల్పించారు. కేటీఆర్ వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ర్యాలీలో ప్రధాని పై బెదిరింపు నినాదాలు సరికాదు

- ఏఐసీసీ నేతలు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోడీని బెదిరించేలా నినాదాలు చేయడం సరికాని పద్ధతి అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓట్ చోర్ గద్దీ చోడ్' పేరుతో ఏఐసిసి ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో మహా ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ధర్నాకు ముందు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించగా, ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు బండి సంజయ్ సోమవారం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా 'మోడీ తేరీ ఖబర్ ఖోదేగీ' వంటి నినాదాలు చేయడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. దేశ భద్రత, గౌరవం, అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ రాత్రింబవళ్ళు శ్రమిస్తుంటే, కాంగ్రెస్ కార్యకర్తలు బెదిరించేలా నినాదాలు చేయడం ఎంతవరకు సమంజసమని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై మల్లిఖార్జున ఖర్గేతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు లోక్‌సభ వేదికగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటుతో మరోసారి తేల్చిచెప్పారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే కాంగ్రెస్‌కు ఉరితాళ్లుగా మారాయని కేటీఆర్ అన్నారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, పార్టీ గుర్తుతో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరింత ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రం చేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా గెలిచిందని గుర్తు చేస్తూ, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం పల్లె పల్లెనా అధికార పార్టీపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమన్నారు.

కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదని, రిక్తహస్తమని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని హెచ్చరించారు. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై బీఆర్ఎస్ సాగిస్తున్న పోరాటానికి ఆశీర్వాదాలు అందిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరికీ ఉజ్వల రాజకీయ భవిష్యత్తు ఉంటుందని, పార్టీ బంగారు బాటలు వేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# 'విష్ణు విన్యాసం'గా శ్రీ విష్ణు కొత్త చిత్రం

## యానిమేషన్ వీడియోతో టైటిల్ ఆవిష్కరణ.. 2026 ఫిబ్రవరిలో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా గుర్తింపు పొందిన హీరో శ్రీ విష్ణు ప్రస్తుతం కొత్త దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో ఓ యూనిక్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్–3గా సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. హేమ, షాలిని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సోమవారం చిత్ర బృందం యానిమేషన్ వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను ప్రకటించింది. ఈ చిత్రానికి 'విష్ణు విన్యాసం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు వెల్లడించారు. టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ చిత్రంలో నయన సారిక కథానాయికగా నటిస్తుండగా, సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళి శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం రెండు పాటల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని మేకర్స్ తెలిపారు. 2026 ఫిబ్రవరిలో థియేట్రికల్ విడుదలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా ప్రకటించారు. యూనిక్ కాన్సెప్ట్, వినోదభరిత కథనంతో రూపొందుతున్న 'విష్ణు విన్యాసం'పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

# మిగిలిన టీ20లకు అక్షర్ పటేల్ ఔట్

**బలగం టీవీ, లక్నో**




దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న టీమిండియాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అనారోగ్య కారణంగా మిగిలిన టీ20 మ్యాచ్‌ల నుంచి తప్పుకున్నట్లు బీసీసీఐ సోమవారం అధికారికంగా ప్రకటించింది. అక్షర్ పటేల్ అనారోగ్యంతో బాధపడుతున్నందున దక్షిణాఫ్రికాతో జరగనున్న మిగిలిన రెండు ఐడీఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ టీ20ల నుంచి తప్పుకున్నారని బీసీసీఐ వెల్లడించింది. ప్రస్తుతం అతడు లక్నోలో జట్టుతోనే ఉన్నాడని, అక్కడ తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

**షాబాజ్ అహ్మద్‌కు అవకాశం**

లక్నో, అహ్మదాబాద్‌లలో జరిగే చివరి రెండు టీ20ల కోసం అక్షర్ స్థానంలో షాబాజ్ అహ్మద్ను జట్టులోకి ఎంపిక చేసినట్లు బీసీసీఐ ప్రకటించింది. మొదటి రెండు మ్యాచ్‌లలో ఆడిన అక్షర్ పటేల్.. ధర్మశాల వేదికగా జరిగిన మూడో టీ20కు అనారోగ్య కారణంగా దూరమయ్యాడు. ఈ విషయాన్ని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ అనంతరం ధృవీకరించాడు. అదే మ్యాచ్‌లో వ్యక్తిగత కారణాలతో జస్ప్రీత్ బుమ్రా కూడా జట్టుకు దూరమయ్యారని పేర్కొన్నారు. వారి స్థానాల్లో హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్లను తీసుకున్నట్లు తెలిపారు.

# సస్పెన్స్ హార్రర్ థ్రిల్లర్‌గా 'జిన్'

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలుగులో సస్పెన్స్ హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందుతున్న చిత్రం జిన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రాన్ని చిన్మయ్ రామ్ దర్శకత్వం వహించగా, అమిత్ రావ్ హీరోగా నటిస్తున్నారు. వరదరాజ్ చిక్‌బళ్లాపుర డైలాగ్స్ అందించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్ సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

ట్రైలర్ భూతనాల చెరువు నేపథ్యంతో పాటు ఒక కాలేజీలో దాగి ఉన్న మిస్టరీ చుట్టూ తిరుగుతుంది. నలుగురు యువకులు ప్రేతాత్మల ఉచ్చులో చిక్కుకోవడం, ఆ కాలేజీ బిల్డింగ్ నుంచి బయటపడలేకపోవడం, మధ్యలో 'జిన్' ఎంట్రీ వంటి అంశాలతో ట్రైలర్‌ను సస్పెన్స్‌గా కట్ చేశారు.

ట్రైలర్ లాంచ్ సందర్భంగా నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ, టైటిల్ చాలా బాగుందని అన్నారు. జిన్‌లో గుడ్ జిన్, బ్యాడ్ జిన్ అనే రెండు కోణాలు ఉంటాయని చెప్పారు. సరైన స్థాయిలో భయపెడితే ప్రేక్షకులు హార్రర్ సినిమాలను ఆదరిస్తారని, సినిమాకు భాషా పరిమితులు ఉండవని, గుడ్ ఫిల్మ్, బ్యాడ్ ఫిల్మ్ మాత్రమే ఉంటాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నటుడు సోహెల్ మాట్లాడుతూ, ట్రైలర్ చూస్తే ఇది ప్రధానంగా 'బ్యాడ్ జిన్' కథగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

ఫస్ట్ లుక్ పోస్టర్‌లో హాలీవుడ్ తరహా ఘోస్ట్‌ను తలపించే విగ్రహం, భయాన్ని కలిగించే బ్యాక్‌డ్రాప్ ఆకృతులు ప్రేక్షకుల ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రాన్ని డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇందులో పర్వీజ్ సింబా, ప్రకాశ్ తుంబినాడు, రవి భట్, సంగీత కీలక పాత్రల్లో నటించారు. సంగీతాన్ని అలెక్స్ అందించగా, సాదలమ్మ ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిఖిల్ ఎం గౌడ ఈ చిత్రాన్ని నిర్మించారు. సస్పెన్స్, హార్రర్ అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రం ఎలా మెప్పిస్తుందో చూడాలి.




# భారత్ పర్యటనను ఘనంగా ముగించిన లియోనల్ మెస్సీ

## ఢిల్లీకి చేరుకున్న సాకర్ దిగ్గజానికి అభిమానుల ఘన స్వాగతం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనల్ మెస్సీ భారత పర్యటన విజయవంతంగా ముగిసింది. సోమవారం ముంబై నుంచి ఢిల్లీకి ఆలస్యంగా చేరుకున్న మెస్సీకి అభిమానులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంకు చేరుకున్న ఆయన, అనంతరం లీలా ప్యాలెస్ హెూటల్లో ఎంపిక చేసిన కొద్దిమంది అతిథులతో గడిపారు. ఆ తర్వాత మెస్సీ సహచర ఆటగాళ్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగోలతో కలిసి అరుణ్ జైట్లీ స్టేడియంకు చేరుకున్నారు. అక్కడ అభిమానులతో కలసి సందడి చేశారు.

**భారత అభిమానుల ప్రేమ మరిచిపోలేనిది: మెస్సీ**

తన భారత పర్యటనపై మెస్సీ స్పందిస్తూ, "ఈ మూడు రోజుల్లో మీరు నాపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిది. స్వల్ప సమయంలోనే మీ అందరి అభిమానం పొందడం మరిచిపోలేనిది. మీరు మా పట్ల చూపిన ప్రేమ, అప్యాయతను మాతో పాటు తీసుకెళ్తున్నాం. ఏదో ఒక రోజు భారత్‌లో మ్యాచ్ ఆడేందుకు తప్పకుండా వస్తాం. అందరికీ కృతజ్ఞతలు" అని అన్నారు. ఈ సందర్భంగా మెస్సీ, సువారెజ్, రోడ్రిగోలకు జై షా చేతుల మీదుగా టీమ్ ఇండియా జెర్సీలు అందజేశారు. అంతేకాకుండా టీమ్ ఇండియా క్రికెటర్ల సంతకాలతో కూడిన బ్యాటును జ్ఞాపికగా బహుకరించారు. అలాగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి సంబంధించిన మ్యాచ్ టికెట్‌ను కూడా మెస్సీకి అందజేశారు. భారత్‌లో మెస్సీ పర్యటన అభిమానులకు చిరస్మరణీయంగా నిలిచిందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.



# జోర్డాన్‌లో ప్రధాని మోడీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారత ప్రధాని విదేశీ పర్యటనలో భాగంగా సోమవారం జోర్డాన్‌కు చేరుకున్నారు.పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నా.. రెండు రోజుల పాటు జోర్డాన్ పర్యటకు మోడీ వెళ్లటం గమనార్హం. జోర్డాన్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్ సాదరంగా స్వాగతం పలికారు. ఆపై హెూటల్‌కు చేరుకున్న మోడీకి ఎన్నారైలు సైతం ఘన స్వాగతం పలికారు. దీనిలో భాగంగా ప్రవాస భారతీయులతో పాటు భారత సంతతికి చెందిన వారితో మోడీ సమావేశమయ్యారు. పలువురు కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రధాని మోడీ జోర్డాన్ పర్యటనలో జోర్డాన్ రాజు అబ్దుల్లాతో హుస్సేనియా ప్యాలెస్‌లో సమావేశం కానున్నారు. జోర్డాన్ రాజు ఆహ్వానం మేరకే ప్రధాని మోడీ.. . ఆ దేశ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. .జోర్డాన్ రాజుతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొనున్నారు. ప్రధాని మోదీ జోర్డాన్ పర్యటనతో ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు బలపడనున్నాయి. ప్రధాని మోడీ జోర్డాన్ పర్యటనకు వెళ్లడం ఏడేండ్ల తర్వాత ఇదే తొలిసారి. 2018లో జోర్డాన్‌ను సందర్శించిన ప్రధాని మోడీ.. ఆ తర్వాత ఇంతకాలానికి అక్కడకు వెళ్లారు.ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏండ్లు కావడం, అదే సమయంలో ఆ దేశ రాజు ఆహ్వానాన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ అక్కడకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.